# అరటి తొక్క

[కాదేదీ కవిత కనర్హం]

జోరుగా వర్షం కురిసి ఆగిపోయింది. బెంగుళూరు బస్‌స్టాండు చిత్తడి చిత్తడిగా అసహ్యంగా వుంది. జనం ప్యాంట్లు మడిచి, గొడుగులు విప్పి నడుస్తున్నారు. బస్‌స్టాండు గడియారం మూడు ముప్పావు చూపింది. ఠకీమని అనంతపురం బస్సు ఖాళీగా ప్రవేశించింది స్టాండులోకి. భాస్కరం కిళ్ళీ షాపు ముందు పొగ వదుల్తూ నిలబడి వాచీ చూసుకొన్నాడు. "అరె! రైట్ టైముకే వచ్చేసిందే" అన్నాడు కన్నడంలో కిళ్ళీషాపు వాడితో. కిళ్ళీషాపు వాడు ఏం మాట్లాడకుండా చూస్తూ కూర్చున్నాడు భాస్కరం వేపు.

రిజర్వు టికెట్టు మరోసారి చూసుకొని భద్రంగా ప్యాంటు కుడి జేబులో దాచుకొన్నాడు. కిళ్ళీషాపువాడు భాస్కరాన్ని గమనిస్తూనే వున్నాడు. చిన్ని మీసాలు, నారో ప్యాంటు, టీ షర్టుతో నిలబడ్డ భాస్కరం ఏం ఉద్యోగం వెలగబెడుతున్నాడో అని ఆలోచిస్తున్నాడు. కిళ్ళీషాపుముందు అటొకటి ఇటొకటి వ్రేలాడుతున్న అరటి పళ్ళ గెలలు చూశాడు భాస్కరం. అనంతపురంలో తన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ గుర్తొచ్చారు. వెంటనే ఓ డజన్ బేరమాడి కొన్నాడు. పళ్ళు సంచిలో దాచేసుకొని తనో పండు ఒలిచి తింటో నిలబడ్డాడు. కిళ్ళీషాపువాడు గమనిస్తూనే వున్నాడు. భాస్కరం అరటి పండు తినడం ముగించి తొక్క అవతల పారేసి, ఎడమ ప్యాంటు జేబులోని చేతి రుమాలుతో మూతి ముడుచుకొన్నాడు.

"ఆ తోలు ప్రక్కన పారేయకూడదూ? ఎవడన్నా తొక్కి పడ్డానికా? అని పోలీసులా అరిచేడు కిళ్ళీషాపు వాడు కన్నడంలోనే.

"ఎవరూ పడరు. అంత కళ్ళులేకుండా ఎవరూ నడవరు. మూసుకొని నడిస్తే పడ్తారు. వాళ్ళ ఖర్మ." అని పన్నెండు దగ్గరున్న పెద్ద ముల్లును చూసి గబగబా ప్రక్కనే ఉన్న హోటల్లోకి దారితీశాడు.

'ఓ పది నిమిషాలు పోజులు కొట్టాడు. అప్పుడు టిఫిన్ తినకూడదూ ఇప్పుడు పరుగెట్టకపోతే' అని మనసులోనే అనుకొన్నాడు కిళ్ళీషాపువాడు.

భాస్కరం హోటల్లోకి ప్రవేశించి ఓ దోసె ఆర్డరిచ్చి అదొచ్చేంతవరకూ కాలక్షేపానికి పకోడీ పత్రమ్మన్నాడు

---

మొదటి బహుమతి రూ. 50

సి. ఇందిర
(బి. ఎస్ సి. ఫైనల్, గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజి. అనంతపురం)

సర్వరుతో. పకోడీ కాజేశాడు. తర్వాత ఓ ఐదు నిమిషాలగాని దోసె రాలేదు. దోసె గబగబా లాగేశాడు.

"కాఫీ తెమ్మంటారా సార్ !" అన్నాడు సర్వర్.

ఔ నన్నట్టు ఎడమ కనురెప్ప పైకీ క్రిందికీ ఎగరేశాడు నాగేశ్రావులా.

గంట నాల్గూ పది అయింది. బస్సు నాలుగుంబావుకి కదలాలి. కాఫీ తాగేసి భాస్కరం హోటల్ తలుపు మధ్యగా నిలబడి సిగరెట్టంటిస్తున్నాడు.

"జరగవయ్యా" అంటూ లావుపాటి మనిషి భాస్కరాన్ని తోసికొని బయటి కెళ్ళాడు. దూరంగా పసుపుపచ్చ అనంతపురం బస్సు హడావుడిగా హారన్ వేసింది. భాస్కరం వాచీ చూసుకొని "ఇంకా మూడు నిమిషా లుంది, ఇవేం బస్సులు" అంటూ కిళ్ళీషాపువాణ్ణి చూస్తూ బస్సువేపు పరుగు తీశాడు.

అంతే. తర్వాత నల్గురు మనుషులు, కిళ్ళీషాపువాడు పగలబడి నవ్వు తున్నారు. కారణం మీరంతా ఊహించే వుంటారు. మన నారోప్యాంటు, టీషర్టు భాస్కరం తను పారేసిన అరటి తొక్క మీదే తన పాయింటెడ్ షూ పెట్టేడు. 'సర్' మని జారి బురద గుంటలో పడ్డాడు. మెల్లగా లేస్తు న్నాడు. తెల్లని ప్యాంటు, చొక్కా బురదతో పాడైపోయాయి. మొహ మ్మీద కూడా కొంత చిమ్మింది.

బస్సు కండక్టరు తన లెక్క సరి పోక పోవటం వల్ల తికమక పడుతూ ఈ గలభా చూసి ఇటొచ్చాడు. భాస్కరం యెక్కాల్సిన బస్సు అదే అని, అతను రిజర్వుడు చేసుకోవడం వల్ల లెక్క సరిపోలేదని తేలిన కండ క్టరు తాపీగా నవ్వుకొన్నాడు. చుట్టూ చేరిన మనుషులు ఇంకా నవ్వుతూనే వున్నారు.

" 'ఎవరేనా పడొచ్చు, ప్రక్కన పారేయండి సార్ !' అన్నా అప్పుడు విన్లేదు. 'ఎవరు పడ్తారే' అని ధీమాగా అన్నాడు పెద్దమనిషి" అని కిళ్ళీషాపు వాడు భాస్కరాన్ని నవ్వుతూన్న వాళ్ళకు పరిచయం చేశాడు. భాస్కరం బురద పట్టిన ప్యాంటూ షర్టును ఏం చెయ్యడమా అని ఆలోచిస్తుండడంవల్ల వాళ్ళ నవ్వులు అతని చెవుల్లో పడ లేదు.

***

---

★ అరుగుమీద కూర్చుని ఏడుస్తున్న రెండేళ్ల పిల్లాణ్ణి దారే పోయే పెద్ద మనిషి పలకరించాడు.

"ఓంతమ్మా, ఎందుకూ ఏలుతున్నావ్" కుర్రాడు ఏడుపు ఆపి "ఏమి టయ్యా, ఎద్దులా వుండి ఆ ముద్దుమాటలు ?" అన్నాడు.